క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

పాఠశాల విద్యా సాధన సర్వే పరీక్ష పరిశీలన



పద్మనాభం కస్తూర్బాలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

పద్మనాభం : పద్మనాభం కస్తూర్బాలో శుక్రవారం జరిగిన పాఠశాల విద్యా సాధన సర్వే పరీక్షను సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్పెషలాఫీషర్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

వరి పంటకు మేలు సస్య రక్షణ చర్యలు

పద్మనాభం : వర్షాభావ పరిస్థితుల్లో వరి పంట ఎండిపోకుండా ఉండేందుకు మల్టీ–కె ఎరువు ఒక కిలో ఎకరానికి పిచికారీ చేసినట్లు అయితే ఏడు రోజుల వరకు వరి పంట ఎండిపోకుండా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటలో తెలిపారు. మండలంలోని పాండ్రంగి, పొట్నూరు, కోరాడ, రేవిడి గ్రామాల్లో ఆకు ముడత, పొడ తెలుళ్లు ఆశించాయన్నారు. వీటి నివారణకు ఎసిపేట్, హెక్స్ కోనజాల్ 100 మిల్లీలీటర్ల మందును రెండు వందల లీటర్ల నీటిలో కలిపి ఎకరం విస్తీర్ణం గల వరి పంటకు పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

పిళ్లా కృష్ణంనాయుడుకి ఘన నివాళి

మధురవాడ : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం పూర్వ ధర్మకర్త పిళ్లా కృష్ణంనాయుడు ప్రథమ వర్ధంతి చంద్రంపాలెం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి, ఆలయం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

క్రాస్ బౌ షూటింగ్‌లో విశాఖ షూటర్ల సత్తా



స్వర్ణ పతకం సాధించిన లోకేజిత్

కొమ్మాది/దాబాగార్డెన్స్: ఆగ్రాలో గత నెల 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ షూటర్లు సత్తా చాటారు. ఎండాడకు చెందిన వి.ఎస్ లోకేజిత్ జూనియర్ బాలుర ఓపెన్ ఫ్రీస్టైల్ కేటగిరీలో స్వర్ణ పతకం, నగరానికి చెందిన పేపకాయల సాయి కౌశిక్ రెండు వెండి పతకాలు సాధించాడు. అత్యంత చిన్న వయసులోనే లోకేజిత్ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంపై అతని తల్లిదండ్రులు రవికుమార్,సహజ హర్షం వ్యక్తం చేశారు. కాగా.. ఆస్ట్రేలియా, , స్వీడన్, ఫిన్లాండ్, యూఎస్ఏ, యూకే, పోర్చుగల్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 65 మంది ఈ పోటీల్లో పడ్డారు.

ప్రజలకు చేరువగా వైద్యం



పిలకవానిపాలెం శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి ద్వారా సత్కారం పొందిన వైద్యులు

- జగనన్న ఆరోగ్య సురక్షతోనే సాధ్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- గణేష్‌నగర్, పిలకవానిపాలెంలలో శిబిరాల నిర్వహణ



గణేష్‌నగర్ శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెం, స్వతంత్ర నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ప్రజల ఇంటి ముంగిటకే వైద్యం తీసుకెళ్లిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. అన్ని వర్గాలు ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం సీఎం జగన్ ప్రజల సంక్షేమం, ఆరోగ్యం కోసం పని చేశారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కూడా విలువైన సేవలందించారని తెలిపారు. ఈ సందర్భంగా శిబిరాలకు హాజరైన వైద్యులను ఎమ్మెల్యే దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శ్రావణ్‌కుమార్, వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, జగ్గుపిల్లి నరేష్, బెల్లాపు పాపారావు, జ్యోతిష్, జీలకర్ర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం పాలెం యూపీహెచ్‌సీలో..

పీఎం పాలెం : ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యసేవలు ఉచితంగా అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పీఎం పాలెం యూపీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధరణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాల వ్యాధులతో బాధ పడుతున్న వారికి ఆరోగ్య సురక్ష ద్వారా ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే సీఎం జగన్ ప్రధాన అశయం అన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. 48వ వార్డు సచివాలయం పరిధిలో 518 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశామని స్థానిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సుజాన్ పల్లా తెలిపారు. అందులో 69 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఐదుగురికి కళ్లద్దాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, స్థానిక నాయకులు పోతిన యల్లాజీ, జామి శివకుమార్, కృష్ణమూర్తిపాత్రుడు, అప్పారావు, పిళ్లా సూరిబాబు, పి.సూర్యప్రకాశం, కాశీప్రసాద్, నరసింహారావు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పీఎం పాలెం యూపీహెచ్‌సీ శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గణేష్‌నగర్ శిబిరంలో పేర్ల నమోదుకు వేచి ఉన్న రోగులు

త్వరలోనే చెరువు అభివృద్ధి పనులు చేపడతాం



చిట్టివలస పెద్ద చెరువు వద్ద మాట్లాడుతున్న జెడ్సీ రాము

తగరపువలస: రూ.6.50 కోట్లతో చేపట్టనున్న చిట్టివలస పెద్ద చెరువు పనులను త్వరలోనే మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటామని భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. చెరువు నుంచి దుర్గంధం వస్తున్న ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి నుంచి వచ్చే వ్యర్థాలు చెరువులో కలుస్తున్నాయని స్థానికులు తెలిపారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బయట ప్రాంతాల నుంచి చెరువులోకి, చెరువు నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే మార్గాలను మూసివేశారన్నారు. అలాగే చెరువులో చేపల పెంపకం చేపడుతున్నారన్నారు. దీనిపై జెడ్సీ స్పందించి ఈ నెల 6న సంబంధిత శాఖల అధికారులతో సమావేశం కానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కూడా చెరువు దుర్గంధం సమస్యలను తీసుకువెళ్లడానికి నిర్ణయించారు. ఏఎంవో శ్రీనివాసరావు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత రఘు కాలేజీ



విజేత జట్టు రఘు ఇంజనీరింగ్ కళాశాల

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం పరిధిలోని కళాశాలల కబడ్డీ పోటీల్లో రఘు ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో దువ్వాడ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విజేత జట్టు అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, పీడీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతోనే దోమల నివారణ

తగరపువలస : దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని భీమిలి జెడ్సీ బి.రాము 2వ వార్డు జీరుపేట గ్రామ మహిళలను కోరారు. శుక్రవారం వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి క్లాప్ వాహనాలకు ఇవ్వాలన్నారు. శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔషధ తయారీలో పారదర్శకతకు కొత్త చట్టాలు



డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ రామకిషన్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: దేశ ఔషధ రంగంలో నాణ్యతా ప్రమాణాలను పెంచడానికి ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డా. ఎం.రామకిషన్ పేర్కొన్నారు. ఔషధ తయారీ రంగంలో పారదర్శకతకు దేశంలో నూతన చట్టాలు అమలు చేస్తున్నారన్నారు. గీతంలో శుక్రవారం నిర్వహించిన ఫార్మా బజ్ జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో ఔషధ ఉత్పత్తులు 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, ప్రపంచంలో ఔషధ ఉత్పత్తుల్లో 12వ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఏటా 12 శాతం మేర వృద్ధి సాధిస్తున్న భారత ఔషధ పరిశ్రమ రంగం ప్రపంచంలో 205 దేశాలకు ఔషధాలను ఎగుమతి చేస్తోందని తెలియజేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతితో 8 వ్యాక్సిన్ ఉత్పత్తి పరిశ్రమలు 43 రకాల వ్యాకిన్లు తయారు చేస్తున్నాయని, ప్రపంచంలోని 65 శాతం బాలలకు అందుతున్నాయని చెప్పారు.

సబ్‌వేపై పడుతున్న నీటిధారతో ఇక్కట్లు



సబ్బవానిపేట వద్ద హైవే నుంచి సబ్‌వే వైపు పడుతున్న నీటిధార

తగరపువలస : జాతీయ రహదారిపై కురిసిన వర్షం సర్వీస్ రోడ్డుపై ధారగా పడుతుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం ఈ ప్రాంతంలో వర్షం కురిసి ఆ నీరు కాస్త సర్వీస్ రోడ్డుపై పడి పలువురు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారిపై నిలిచిపోయిన నీటిని పైపుల ద్వారా కిందకు పంపించే ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి దుకాణం ముందు చెత్త డబ్బా ఉంచాలి



సంగివలస పోలమాంబ అలయం ఎదురుగా డ్రైనేజీలో పేరుకుపోయిన పాలిథిన్, డిస్పోజబుల్ వ్యర్థాలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో ప్రతి దుకాణదారుడు విధిగా చెత్త డబ్బా ఉంచి దాని ద్వారా సేకరించిన చెత్తను క్లాప్ వాహనాలకు ఇవ్వాలని రెండో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బొట్టా శ్రీకాంత్ కోరారు. శుక్రవారం ఆయన సంగివలసలో పర్యటించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన పాలిథిన్, డిస్పోజబుల్ వ్యర్థాలను గుర్తించారు. దీనిపై దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలిథిన్ వస్తువుల విక్రయం, వాడకం, కొనుగోలు నిషేధించినందున ఎవరి వద్దయినా అవి పట్టుబడితే జరిమానా విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడానికి సిఫారసు చేస్తామని హెచ్చరించారు. పశు మాంసం వ్యాపారులను గుర్తించి వారిపై నిఘా పెడుతున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాంసం వ్యర్థాలు గుర్తిస్తే అలాంటి దుకాణాలను కూడా రద్దు చేయిస్తామన్నారు. దీనిపై శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.

రూ.5.కోట్లతో అనంతుడి ఘాట్ రోడ్డు అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఘాట్ రోడ్డు అభివృద్ధికి పంచాయతీ రాజ్ శాఖ నిధులు రూ.5 కోట్లు మంజూరైనట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నిధులతో ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఘాట్ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేవిడి పీహెచ్‌సీ తొమ్మిది పడకలకు అప్‌గ్రేడ్

రేవిడి పీహెచ్‌సీ ఆరు పడకల నుంచి తొమ్మిది పడకలకు అప్‌గ్రేడ్ అయినట్టు వారు తెలిపారు. ఇప్పుడున్న పీహెచ్‌సీ భవనంపై గదులు నిర్మించేందుకు రూ.9.50 లక్షలు మంజూరు అయినట్లు వారు పేర్కొన్నారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేయనున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http://visakha patnam.nic.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

న్యూ హోప్ ఫౌండేషన్ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

కొమ్మాది: న్యూ హోప్ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి నవంబర్ నెలలో జీవన సాఫల్య జాతీయ పురస్కారాలు అందజేయనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ, సాహిత్యం, పారిశ్రామిక, రాజకీయ, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డా.ఎం.నాగమల్లేశ్వరి, సాంస్కృతిక విభాగం కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు గెలుపే లక్ష్యం కావాలి



క్రీడాకారుల ఎంపికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ద్రోణంరాజు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన తైక్వాండో ఎంపికలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. క్రీడా కారులను పరిచయం చేసుకుని 67వ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల జట్ల ఎంపికలు ప్రారంభించారు. జిల్లాలోని ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశాఖ జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు పర్యవేక్షణలో జరిగిన ఎంపికల్లో నిర్వాహక చంద్రంపాలెం హైస్కూల్ పీడీ పెంటకోట రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రావణ్‌కుమార్, బంగారు ప్రకాశ్, రిఫరీలు ఆనంద్, అనిల్, పాత్రికేయుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అండర్–14 సెలక్షన్స్..

శనివారం అండర్–14 విభాగంలో బాలబాలికల జట్ల ఎంపికలు జరగనున్నాయని, అంతా సకాలంలో హాజరు కావాలని కన్వీనర్ ఎ. అప్పలరాజు కోరారు.

యువకుడి అదృశ్యం



యర్రా లక్ష్మణ రావు (ఫైల్)

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు గాంధీబొమ్మ వీధి, రామన్నపేటకు చెందిన యర్రా లక్ష్మణరావు అనే యువకుడు కనిపించడం లేదని భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలివి.. పెందుర్తిలోని కోల్డ్ కేర్ హేచరీలో విధులు నిర్వర్తించే లక్ష్మణరావుకు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహించే వ్యసనం కారణంగా ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 30వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని తల్లి పైడిరాజుకు చెప్పి వెళ్లిన లక్ష్మణరావు తిరిగి రాలేదు. ఫోన్ చేస్తున్నా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఆమె శుక్రవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును భీమిలి ఎస్ఐ గంటా హరీష్ దర్యాప్తు చేస్తున్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్టేట్ అటల్ టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బృందంలో అధికారులు ఎస్.వి.రమణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్, సీహెచ్ గిరిప్రసాద్ పలు అంశాలు పరిశీలించి, ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మారథాన్, ఇన్నోవేషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు, వారి ప్రాజెక్టుల గురించి ఆరా తీశారు. హెల్త్ కోటులో భాగంగా ప్రాజెక్టు నిర్వహించిన 10వ తరగతికి చెందిన సౌజన్యతో మాట్లాడి, ప్రాజెక్టు గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల అవార్డులను, సర్టిఫికెట్లను, ల్యాబ్ రికార్డు నగదు లావాదేవీలను తనిఖీ చేశారు. వర్కుషాపులు, బూట్ క్యాంపులు, రికార్డులు పరిశీలించారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా క్లాసులు నిర్వహిస్తూ వాటిని రికార్డు చేయాలని తెలిపారు. వ్యక్తిగత ల్యాబ్ రికార్డులు నిర్వహిస్తూ 15 రోజులకు ఒక్కసారి సంబంధిత అధికారి చేత వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నాగమణి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంతి, సైన్స్ టీచర్లను అభినందించారు.

నేటి నుంచి ఓటర్ స్పెషల్ డ్రైవ్

తగరపువలస : ఈ నెల 4, 5 తేదీల్లో తగరపువలస గ్రంథాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఓటర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఇందులో ఓటరు జాబితాలో పేర్ల తనిఖీ, ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులు వంటివి చేస్తారు. కొత్తగా ఓటరు నమోదుకు ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

ఎన్టీపీసీ సింహాద్రిలో వెండర్ మీట్ ఏర్పాటు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శకుంతలం ఆడిటోరియంలో విజిలెన్స్ అవెర్‌నెస్ వీక్–2023లో భాగంగా శుక్రవారం వెండర్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థ నుంచి 50 మంది విక్రేత ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వెస్ట్–2) సి.శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మీట్ వెండర్ల సమస్యలను అంచనా వేశారు. వివిధ పీఎస్‌యూల్లో సాంకేతికతను ఉపయోగించడంలో ఎన్టీపీసీ ముందంజలో ఉన్నందుకు ప్రతినిధులను అభినందించారు. ఈ సమావేశంలో యూఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కుందు, చీఫ్ జనరల్ మేనేజర్ యు.హెచ్.గోఖే పాల్గొన్నారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, వీపీజీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, డీజీఎంలు, ఉద్యోగులు హాజరయ్యారు.

ఖైదీ రాజాచంద్ర మృతిపై 7న విచారణ

తగరపువలస: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బండ్లగూడకు చెందిన ఖైదీ యడ్ల రాజాచంద్ర (41) ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రి చికిత్స పొందుతూ ఈ ఏడాది మార్చి 9న మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో రాజాచంద్ర మృతిపై భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని విచారణ అధికారిగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించారు. ఈ నెల 7న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనున్నారు. రాజాచంద్ర మృతిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే విచారణకు హాజరై మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా తెలియచేయాలని భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

కనకమ్మ వారికి పసుపు కుంకుమలు



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ వాసులు శుక్రవారం గ్రామ శివారులోని కనకమ్మ వారికి పసుపు కుంకుమలు సమర్పించారు. వీరితో పాటు ఆశిపాలెం, సిటీనగర్ ప్రజలు కూడా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం రాత్రి నుంచే భక్తులు అమ్మవారికి దివిటీల వెలుగు ద్వారా నీరాజనాలు పలికారు. శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

దొంగలతో జాగ్రత్తగా ఉండాలి

ఆరిలోవ: దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని ద్వారకా ఏసీపీ వెంకటరావు సూచించారు. ద్వారకా క్రైం విభాగం పోలీసులు పెదగదిలిలో మహిళలకు శుక్రవారం చోరీల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలకు ఊరు వెళ్లేవారు ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచకూడదన్నారు. విలువైన వస్తువులను వెంట తీసుకువెళ్లాలని, లేదంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం దొంగతనాలు జరిగే తీరు, జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, ఎస్.ఐ రుక్మంగదరావు పాల్గొన్నారు.